BHARATH SAMACHAR DIGITAL

11, నవంబర్ 2026, బుధవారం భారత్ సమాచార్

స్నేహానికి సరికొత్త అర్థం.. మిత్రుడి కూతురి భవిష్యత్తుకు భరోసా



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: స్నేహానికి మరణం లేదని నిరూపించారు ఆ బాల్యమిత్రులు. తమతో కలిసి చదువుకుని, ఆడిపాడిన స్నేహితుడు అకాల మరణం చెందడంతో.. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. స్నేహితుడి కూతురి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తమ ఉదారతను చాటుకున్నారు. ఈ హృదయాన్ని తాకే ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్ గ్రామంలో చోటుచేసుకుంది.

కాచికల్ గ్రామానికి చెందిన చిలుక రవి ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో ఆయనతో చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన బాల్యమిత్రులైన కాంగ్రెస్ పార్టీ మండల నేత ఆకుతోట సతీష్, వస్రాం తండా సర్పంచ్ గుగులోతు కరుణ మధు నాయక్, మల్యాల అశోక్‌లు తీవ్రంగా కలత చెందారు. తమ స్నేహితుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆయన కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను చూసి చలించిపోయారు. మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

ఈ క్రమంలో బుధవారం రవి ఇంటికి చేరుకున్న ముగ్గురు స్నేహితులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రవితో కలిసి చదువుకున్న రోజులు, చిన్ననాటి ఆటపాటలు, కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. స్నేహితుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు తమ అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు.

అనంతరం రవి కూతురి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ స్నేహితుడు భౌతికంగా తమ మధ్య లేకపోయినా.. ఆయన కూతురిని తమ బిడ్డగా భావించి భవిష్యత్తులోనూ ఆదుకుంటామని తెలిపారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి, స్నేహబంధంలోని గొప్పతనాన్ని చాటుకున్నారు. నిజమైన స్నేహం అంటే కలిసి ఉన్నప్పుడే కాదు.. స్నేహితుడు లేని సమయంలోనూ అతడి కుటుంబానికి తోడుగా నిలవడమేనని ఈ ముగ్గురు మిత్రులు తమ చేతలతో నిరూపించారు.

© 2026 Bharath Samachar